### హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


2


2

### హనుమాన్ జయంతికి సెలవు ప్రకటించాలి


AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## నవోదయ పరీక్ష ఫలితాలు విడుదల



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నిజాంసాగర్ నవోదయ ఫలితాలు విడుదలయ్యాయి. 2026-27కు విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశపరీక్ష ఫలితాలను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా నవోదయ ఎగ్జామ్స్ ఇన్‌ఛార్జి ప్రభాకర్ మాట్లాడుతూ.. గతనెల డిసెంబర్ 13న పరీక్షలు నిర్వహించగా.. నేడు ఫలితాలు విడుదలయ్యాయని పేర్కొన్నారు. జానకంపల్లి కుర్దు పాఠశాలకు చెందిన నిషిత్ చంద్ర అనే విద్యార్థి కామారెడ్డి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించాడు.



**కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. కొందరు అధికారులు కార్యాలయంలో తిష్ట వేసి భారీగా లంచాలు తీసుకుంటున్నారు. ప్రతి పనికి ఓ రేటు కడుతున్నారు. పైసలు ఇస్తేనే పనులు చేస్తున్నారు. సామాన్య ప్రజల నుంచి మొదలు పెడితే కాంట్రాక్టర్ల వరకు ఎవరిని వదలడం లేదు. ఆయా పనులకు సంబంధించి బిల్లుల కోసం కొందరు అధికారులు కమీషన్ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వని వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్న అధికారులు.. చేతులు తడపగానే.. ఏమి చూడకుండా సంతకాలు చేస్తున్నారు. కామారెడ్డి బల్దియా కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారుల తనిఖీలతో లంచాలు తీసుకునే అధికారులు ఆందోళన చెందుతున్నారు.**

**– అక్షరటుడే, కామారెడ్డి**



# అవినీతి తిమింగలాలు

**▪ కామారెడ్డి బల్దియాలో తిష్ట ▪ డబ్బులిస్తేనే పనులు ▪ ఏసీబీ తనిఖీలతో కలవరం**

కామారెడ్డి మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు రావడం కొత్తేమికాదు. 'ఆరోపణలు వస్తుంటాయి.. పోతుంటాయి మేము చేస్తూనే ఉంటాం' అన్నట్టుగా మున్సిపాలిటీలో పలువురు అధికారులు ప్రవర్తిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికారులకు మామూళ్లు ఇస్తేనే పనులు చేస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ఏసీబీ అధికారులు సోమవారం దాదాపు 8 గంటల పాటు కార్యాలయంలో సోదాలు చేశారు. ఈ సమయంలో పలు అక్రమాలు గుర్తించారు. దీంతో అవినీతి అధికారులు భయపడుతున్నారు. తమపై చర్యలు తీసుకుంటారేమోనని ఆందోళనకు గురవుతున్నారు.

### సమాచారం లీక్ అయిందా..

మున్సిపాలిటీలోని పలువురు అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఏసీబీ దాడుల సమయంలో పలు శాఖల అధికారులు విధులకు డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది. సదరు అధికారులకు ముందుగానే దాడుల సమాచారం లీక్ అయిందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతోనే వాళ్లు సెలవుపై వెళ్లినట్లు సమాచారం. కాగా.. బల్దియాలో పలువురు అధికారులకు బినామీలు ఉన్నట్టుగా తెలుస్తోంది. వారి ద్వారా అవినీతి అక్రమాలకు తెర లేపినట్టుగా సమాచారం. బినామీల ద్వారా డబ్బులు తీసుకుని పనులకు పచ్చజెండా ఊపినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలో భారీగా నగదు చేతులు మారిందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో భారీగా అవినీతి జరిగినట్టుగా ఏసీబీ గుర్తించినట్టుగా తెలుస్తోంది. భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. పర్మిషన్ ఇవ్వడంలో జాప్యానికి డబ్బులు రాకపోవడమే కారణమని తెలుస్తోంది.

### నాయకుల గుండెల్లో రైళ్లు

ఏసీబీ దాడుల నేపథ్యంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులకు చెమటలు పడుతున్నాయి. అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అప్పట్లో పలువురు కౌన్సిలర్లు చక్రం తిప్పారన్న విమర్శలున్నాయి. కమర్షియల్ షాపుల లైసెన్సులు రెన్యూవల్ చేసుకోకుండా పెద్ద మొత్తంలో తీసుకొని వ్యాపారులకు సహకరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా జరిగితే తాము చూసుకుంటాము అని భరోసా ఇచినట్టుగా ప్రచారం సాగుతోంది. ఫలితంగా ప్రభుత్వానికి రూ.కోటి వరకు బకాయిలు పేరుకు పోయాయి. ఇప్పుడా బకాయిలు వసూలు చేస్తే పలువురు కౌన్సిలర్లు, నాయకుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### జీతాలు నొక్కేసింది ఎవరో?

మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ విభాగంలో దాదాపు 400 మంది కార్మికులు పని చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇందులో కొందరు కార్మికులు విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే పూర్తి నెల జీతం చెల్లించినట్లు ఏసీబీ గుర్తించింది. అయితే కార్మికులకు మాత్రం సగం జీతమే ఇచ్చినట్లు సమాచారం. మిగతా సగం జీతం ఎవరు నొక్కేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా ఎంతమంది జీతాలు వెనకేసుకున్నారోనని కార్మికులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

### మున్సిపాలిటీలో సైలెన్స్

ఏసీబీ దాడులకు ముందు కామారెడ్డి మున్సిపాలిటీ రద్దీగా కనిపించేది. పలువురు నాయకులు, కౌన్సిలర్లు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారు. దాడుల తర్వాత ఒక్కరు కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ప్రశాంతంగా మారింది. అధికారులు ఎవరి పనుల్లో వారు బిజీ అయ్యారు.



## కేంద్రీయ విద్యాలయాల్లో అదనపు సెక్షన్లు మంజూరు..

### ఫలించిన ఎంపీ అర్వింద్ కృషి..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్, బోధన్ కేంద్రీయ విద్యాలయాల్లో అదనపు సెక్షన్లను మంజూరు చేస్తూ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది. దీంతో కొన్ని రోజులుగా ఆయా విద్యాలయాల్లో అదనపు సెక్షన్లు మంజూరు చేయాలని ఎంపీ అర్వింద్ చేసిన కృషి ఫలించినట్లయ్యింది. ఆయన కృషితో ప్రస్తుతం అదనపు సెక్షన్ల మంజూరుతో పాటు ఇంటర్ ఫస్టియర్‌లో సైతం సీట్లను కేటాయిస్తూ కేవీఎస్ నిర్ణయం తీసుకుంది. బోధన్ కేంద్రీయ విద్యాలయం లో రెండో తరగతి నుంచి 5వ తరగతి వరకు అదనపు సెక్షన్లు మంజూరయ్యాయి. అలాగే నిజామాబాద్ కేంద్రీయ విద్యాలయంలో మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా ఇంటర్ ప్రథమ సంవత్సరం సైన్స్‌కు సైతం అనుమతి లభించింది. దీంతో తరగతి 40 చొప్పున మొత్తం 320 మంది విద్యార్థులకు సీబీఎస్‌సీ విధానంలో నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. అదేవిధంగా.. రెండు కేంద్రీయ విద్యాలయాల్లో అదనపు సిబ్బంది నియామకానికి సైతం మార్గం సుగమమైంది.

## కామారెడ్డిలో ఆశా వర్కర్ల ఆందోళన ఉద్రిక్తం



**అక్షరటుడే, కామారెడ్డి:** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్లు చేపట్టిన రెండు రోజుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. రెండు రోజులుగా ధర్నా చేపడుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. దాంతో పోలీసులు ఆశావర్కర్లను బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. బారికేడ్లను తోసుకుంటూ ఆశావర్కర్లు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు, ఆశా వర్కర్లకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ తోపులాటలో ఓ ఆశా వర్కర్ కిందపడి గాయాలయ్యాయి. కాలికి తీవ్రంగా గాయం కావడంతో పాటు సదరు ఆశా వర్కర్ సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే 108 అంబులెన్సులో ఆమెను జీజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులపై ఆశా వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. పోలీసుల తీరుతో ఓ ఆశా వర్కర్ కిందపడి గాయాలపాలైందన్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ న్యాయమైన పోరాటాన్ని ఆపేది లేదన్నారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## కేటీఆర్ అసత్య ప్రచారాలు మానుకోవాలి: ఎమ్మెల్యే మదన్ మెహన్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై కేటీఆర్ అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే మదన్ మెహన్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంపై కేటీఆర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే మదన్‌మోహన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో ఎల్లారెడ్డిలో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. అలాంటిది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తమ నియోజకవర్గంపై వాస్తవాలను వక్రీకరిస్తున్నారన్నారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసిన ప్రజలే ఓట్లేసి మున్సిపాలిటీని కాంగ్రెస్‌కు కట్టబెట్టారన్నారు. అలాంటిది కేటీఆర్ మాయమాటలు చెబితే ఇక్కడ నమ్మేవాళ్లు ఎవరూ లేరని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 12 వార్డులలో 11 వార్డులు కాంగ్రెస్ కైవసం చేసుకుందని.. బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తిరస్కరిస్తూ ఎల్లారెడ్డి ప్రజలు స్పష్టమైన తీర్పును గుర్తుచేశారు. ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ గల్లంతైనప్పటికీ ఏం చూసుకుని కేటీఆర్ మాట్లాడుతున్నాడో అర్థం కావట్లేదన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన వారు ఇప్పుడు అసత్య ప్రచారాలతో రాజకీయ లాభం పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు.




## పోలీస్ శాఖకు బ్రీత్ ఎనలైజర్స్ అందజేత

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** జాతీయ రహదారి 44పై తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో నియంత్రణకు పోలీస్ శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేయడానికి.. సేవ్ లైఫ్ ఫౌండేషన్ 10 బ్రీత్ ఎనలైజర్లను అందజేసిందని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. వెర్టీస్ ఫౌండేషన్ సహకారం, ఢిల్లీకి చెందిన సేవ్ లైఫ్ ఫౌండేషన్ సహాయంతో కమిషనరేట్‌లో బ్రీత్ ఎనలైజర్స్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి, సేవ్ లైఫ్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ నూర్ కేతర్వాల్, ఈడార్ మేనేజర్ శ్రీవర్ష, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి..






**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికుల కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. వారికి టీయూసీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో, ఔట్‌సోర్సింగ్ విభాగంలో కార్మికులతో ఇప్పటికే కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు ఉన్నాయన్నారు. ఇవి కాకుండా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో 330 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వాటర్ వర్క్స్ కార్మికులు డ్రైవర్లు, సీఐజీ గ్రూపులలో లేరన్నారు. వీరిని మాత్రమే కొత్తగా గ్రూప్‌లుగా చేయాలన్నారు. ఇప్పటికే ఉన్న సీఐజీ గ్రూప్‌లను రద్దుచేసి కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలనుకోవడం సరైంది కాదన్నారు. కొత్త గ్రూప్‌లు ఏర్పాటు చేస్తే కార్మికులపై పనిభారం పెరుగుతుందని నాయకులు అన్నారు. ఇప్పటికే ఉన్న సీఐజీ గ్రూపులను కొనసాగిస్తూ, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ 330 మంది, వాటర్ వర్క్స్ కార్మికులను 25 నుంచి 35 మందితో ఒక గ్రూప్‌గా ఏర్పాటు చేయాలన్నారు. పాత సీఐజీ గ్రూపులను కదపాలని చూస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. అదేవిధంగా ఔట్‌ సోర్సింగ్ కార్మికులందరికీ యూనిఫాంలు, సబ్బులు, నూనెలు, రక్షణ పరికరాలు ఇవ్వాలని, కేటగిరీల వారీగా ఇతర మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇస్తున్నట్లు వేతనాలు చెల్లించాలని, పీఎఫ్ ఈఎస్ఐలలో ఉన్న తప్పులను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకులు కిరణ్, లింగం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు భానుచందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. కార్పొరేషన్ కార్యాలయాన్ని మున్సిపల్ కార్మికులు ముట్టడించిన క్రమంలో కొందరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. తోపులాట జరగగా అందులో మహిళా కార్మికులు స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే తోటి కార్మికులు వారిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స అందించారు.

## ప్రభుత్వ హామీలపై నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తెలిపారు. ఈ మేరకు నగరంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తాము నిరంతరం పోరా టం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంగళ, బుధవారాల్లో తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తామని తెలి పారు. ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ కలెక్టరేట్ ముట్టడికి ప్రజల మద్దతు అవసరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత హామీలపై ప్రజల తరపున బీజేపీ ప్రశ్నిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రైతుల సమస్యలపై కాంగ్రెస్ స్పందించడం మానేసిందని ఆయన దుయ్యబట్టారు. మొక్కజొన్న పంటలకు సరైన ధర లభించక రైతులు అవస్థలు పడుతున్నారని.. మార్కెట్లో రూ.1,500 నుంచి రూ.1,600 మధ్యలో ఉండటం వల్ల రైతు తాను పెట్టిన పెట్టుబడి కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కలెక్టరేట్ ముట్టడిని నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతన్‌కర్ లక్ష్మీ నారాయణ, నాగోళ్ల లక్ష్మీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ప్రమోద్ కుమార్, బంటు రాము, నిమ్మల శ్రీనివాస్, బాన్సువాడ ఇన్‌ఛార్జి కోనేరు శశాంక్, రూరల్ కన్వీనర్ పద్మ రెడ్డి, జిల్లా కార్యదర్శులు దాంపల్లి జ్యోతి, పోల్కం వేణు, పాలెపు రాజు, బద్దం కిషన్, పుట్ట వీరేందర్, జగన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అమంద్ విజయ్ కృష్ణ, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2 | నిజామాబాద్/కామారెడ్డి
మంగళవారం
17.3.2026
www.aksharatoday.in
AKSHARA TODAY



## స్పోర్ట్స్ స్కూల్‌కు ముగిసిన ఎంపికలు..

**అక్షరటుడే, గాంధారి:** మండలం కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక పోటీలు ముగిసినట్లు పీఈటీ లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ఎంఈవో శ్రీహరి ఆదేశానుసారం ఈ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇదివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ముగ్గురు విద్యార్థుల్లో బాలికలు సాయి చెల్సియా రాథోడ్, అశ్విని, బాలుర విభాగంలో ఆశ్రిత్ గౌతమ్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మార్చి 28న జిల్లాస్థాయి పోటీలు కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగనున్నాయన్నారు. ఎంపిక పోటీల్లో పీఈటీలు జైత్రం, సుజాత పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి, పిట్లం సీహెచ్‌సీల్లో బాలికలకు హెచ్‌పీవీ టీకాలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బాలికలకు హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ఇప్పటికే జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ టీకాను బాన్సువాడ ఎంసీహెచ్‌లో, జీజీహెచ్ కామారెడ్డిలో ఇస్తున్నారు. అయితే ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు, గురువారం నుండి ఎల్లారెడ్డి, పిట్లం సీహెచ్‌సీలలో అందజేస్తున్నట్లు డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ తెలిపారు. ఈ టీకా గర్భాశయ క్యాన్సర్ రాకుండా నివారిస్తుందని తెలియజేశారు. అందువల్ల తల్లిదండ్రులు తమ 14ఏళ్ల బాలికలను సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి టీకా వేయించాలని కోరారు. ఈ టీకా సురక్షితమైనది, సమర్థవంతమైందని.. అలాగే ఉచితంగా అందిస్తున్నామన్నారు. సీహెచ్‌సీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టీకాలు వేస్తారన్నారు.



నగరంలో రంజాన్ సందడి నెలకొంది. నగరం నడిబొడ్డున ఉన్న నెహ్రూపార్క్‌లో చౌరస్తా చుట్టూ దుస్తుల దుకాణాలు ఏర్పాటు చేశారు. అలాగే గాంధీ చౌక్ ప్రాంతంలోనూ రోడ్లపక్కన పలు పింగాణీ వస్తువులు, పర్ఫ్యూమ్ దుకాణాలు వెలిశాయి. రంగురంగుల లైటింగ్, కొనుగోలు దారులు, విక్రయ దారులతో ఆ ప్రాంతాలు సందడిగా మారాయి. ప్రత్యేక ఫుడ్‌స్టాల్స్, హలీం వంటకాలు, ఇతర పానీయాల దుకాణాలు వెలియడంతో రాత్రి పూట ఆ ప్రాంతానికి కొనుగోలుదారులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

# నగరంలో రంజాన్ సందడి..





## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**అక్షరటుడే, బోధన్:** ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైందని బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆందోళన చేపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ వ్యతిరేక విధానాలకు నిరసనగా బీజేపీ ర్యాలీ

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా మండలంలోని బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సున్నం మోహన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కొత్తపల్లి గణేష్, శక్తి కేంద్రం ఇన్‌ఛార్జి పోల్కం నవీన్, రెంజల్ గంగాధర్, రామస్వామి, నల్లమోహన్, ఏనుగు కిషన్, శ్రీధర్, దామోదర్ ప్రవీణ్, మణికంఠ, లక్ష్మి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా చిన్నారుల కోసం ఏసీ అందజేత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులు చికిత్స పొందుతున్నారు. వారు చికిత్స పొందుతున్న వార్డులో ఎండాకాలంలో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వైష్ణవి ఆస్పత్రి వైద్యురాలు సవితారాణి ఏసీ అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు ఆమెను సన్మానించారు. దాతలు ముందుకు రావడం సమాజానికి ఒక గొప్ప సందేశమని తెలిపారు. రెడ్‌క్రాస్ సభ్యులు మాట్లాడుతూ.. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నిర్వహణ కమిటీ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, నిజామాబాద్ డివిజన్ ఛైర్మన్ శ్రీశైలం పాల్గొన్నారు.



## ట్రాన్స్‌జెండర్ నివాసంలో హనుమాన్ స్వాములకు భిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో ఓ ట్రాన్స్‌జెండర్ హనుమాన్ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. దివ్య ప్రజ్ఞా అనే ట్రాన్స్‌జెండర్ గతంలో అయ్యప్ప పూజ నిర్వహించి స్వాములు అన్నదానం చేశారు. ఇదే క్రమంలో మంగళవారం హనుమాన్ స్వాములకు సైతం భిక్ష ఏర్పాటు చేసి తన భక్తి భావాన్ని చాటారు. కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ కల్పె అర్చన చిరంజీవి, బృంద సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తి, సమానత్వం, సామాజిక ఐక్యతకు ట్రాన్స్‌జెండర్ ఒక ఉదాహరణగా నిలిచిందని స్థానికులు పేర్కొన్నారు.



## నాళేశ్వర్ మాటు కాల్వను పరిశీలించిన అధికారులు



**అక్షరటుడే, బోధన్:** అంకంపల్లి, నాళేశ్వర్ పొలాల మధ్య నుంచి ఉన్న మాటు కాలువను మంగళవారం మండల అధికారులు పరిశీలించారు. ఈ మేరకు కాలువ మరమ్మతులకు సంబంధించి బడ్జెట్‌ను ఎస్టిమేషన్ వేశారు. ఈ మాటు కాలువ లోతు పూడుకపోయి, చుట్టుపక్కల మాటుభూమి తగ్గడంతో.. వర్షాకాలంలోనూ కాలువలో నీళ్లు పారకం తగ్గిపోయింది. ఈ క్రమంలో నాళేశ్వర్ సర్పంచ్ ఇటీవల బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మాటుకాలువకు మరమ్మతులు చేయాల్సిందిగా విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆధికారులు నాళేశ్వర్ గ్రామాన్ని సందర్శించారు. మాటుకాలువ పరిస్థితిని, మరమ్మతులకు అయ్యే అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ బాలరం, ఏఈ శ్రీధర్, పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వర్లు, నాళేశ్వర్ సర్పంచ్ ఆర్మూర్ లావణ్య, ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, వార్డు సభ్యులు కిషాన్ రాజు, గణేష్, మాజీ సర్పంచ్‌లు తిమ్మాపురం సాయారెడ్డి, మగ్గరి నర్సింగ్ రావు, సొసైటీ మాజీ ఛైర్మన్ మగ్గరి హన్మాండ్లు, బెల్లాల్ నర్సింగ్ రావు, గ్రామబివృద్ధి కమిటీ సభ్యులు గంగాధర్, లక్ష్మణ్, కొండయ్య, జనార్దన్ గ్రామస్థులు పాల్గొన్నారు.



## 11వ వార్డులో వ్యర్థాలు తొలగింపు

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని 11 వార్డులో భామనరేవు వాగుకు వెళ్లే దారిలో చెత్తాచెదారాన్ని తొలగించారు. సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, ఉపసర్పంచ్ భాస్కర్ గౌడ్, 11వ వార్డు మెంబర్ నితిన్ దగ్గరుండి డోజర్ సాయంతో తొలగింపు చేపట్టారు. దారిని శుభ్రం చేసి రాకపోకలకు అనువుగా మార్చడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించిందన్నారు.

## హనుమాన్ జయంతికి సెలవు ప్రకటించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించాలని అఖిల భారత శ్రీ హనుమాన్ దీక్ష సేవా సమితి బాన్సువాడ విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో వసంతకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి పండుగను రాష్ట్రవ్యాప్తంగా గ్రామ గ్రామాన భక్తి శ్రద్ధలతో ప్రజలు జరుపుకుంటారని తెలిపారు. అలాంటి ప్రధాన హిందూ పండుగకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని అధికారికంగా సెలవుదినంగా ప్రకటించాలన్నారు. వినతిపత్రంపై స్పందించిన సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో వసంత, ఈ అంశాన్ని కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమితి గురుస్వాములు అంబిలిపూర్ రాజు, పాలకుర్తి దత్తు, తేలి మహేష్ కుమార్, కల్లేటి వెంకట రమణ, దాసరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అజమాబాద్ రైతు వేదికలో తిమ్మారెడ్డి గ్రామ రైతులకు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై రైతుశిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డి తండాకు చెందిన 125 మంది రైతులు హాజరయ్యారు. వారికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రైతులకు సేంద్రియ పద్ధతులు పంటలు పండించే విధానం గురించి అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువులను పురుగుమందులను వాడకుండా వేప కషాయం, జీవామృతం, గణామృతం తయారీ విధా నం గురించి వివరించారు. రైతులకు సేంద్రియ వ్యవసాయం సంబంధించిన కిట్స్‌ను తిమ్మారెడ్డి సర్పంచ్ అనసూయ గంగారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ అలీ, గ్రామ రైతులు నరసింహారెడ్డి, గంగారెడ్డి, సాయి రెడ్డి, మోహ న్ రెడ్డి, చిలుక రాములు, ఊరటి శ్యామరావు, షేక్ మదర్, విఠల్, మండల వ్యవసాయ అధికారి ఆచరిత, ఏఈవోలు రాజాగౌడ్, సతీష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ




**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని నాగపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యార్థులకు యూనిఫామ్‌లు, టైలు, బెల్టులు, షూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ పాల్గొని విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమానత్వ భావన పెంపొందించేందుకు యూనిఫామ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధుల సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాస రవికుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దొండి కృష్ణవేణి, సర్పంచ్ పోలేపల్లి హేమలత లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ ఎంబరి నర్సయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ ఆరెపల్లి లక్ష్మి, పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కస్ప గంగనర్సయ్య పాల్గొన్నారు.